క్లుప్తంగా

నేటి బస్సు యాత్ర రద్దు

గుంతకల్లు: గుంతకల్లులో శనివారం జరగాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్ర రద్దు చేసినట్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఎమ్మెల్సీ విప్ వై.శివరామిరెడ్డి సతీమణి ఉమాదేవి ఆకస్మిక మరణం కారణంగా బస్సు యాత్ర వాయిదా పడినట్లు పేర్కొన్నారు. పార్టీ అధిష్టాం నిర్ణయం మేరకు తిరిగి గుంతకల్లులో బస్సు యాత్రను నిర్వహించే తేదీని ప్రకటిస్తామని ఆయన వివరించారు.

కొల్హాపురమ్మ ఆలయం వద్ద బోరు ఏర్పాటు



పూజలు నిర్వహిస్తున్న కౌన్సిలర్ చెన్నమ్మ

గుంతకల్లుటౌన్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఇచ్చిన హామీ మేరకు పాత గుంతకల్లులోని కొల్హాపురమ్మ ఆలయం వద్ద బోరును ఏర్పాటు చేయించారు. శుక్రవారం వార్డు కౌన్సిలర్ దర్గాచెన్నమ్మ బోరుబావి తవ్వకానికి పూజలు నిర్వహించారు. కాలనీవాసులు, ఆలయ భక్తాదుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే వైవీఆర్ నీటి సౌకర్యం కల్పించడంపై కాలనీవాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ దర్గానాయుడు, నాయకులు జెన్నేమస్తాన్, మంతకల్లు, శ్రీనివాసులు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

గుత్తి రూరల్: ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతి పత్రం అందజేశారు. నాయకులు రామకృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి నిర్మల, కేవీపీఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ వెంకటరమణ

గుత్తి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎండీయూ వాహనాలను శుక్రవారం విజిలెన్స్ సీఐ వెంకటరమణ తనిఖీ చేశారు. అనంతరం 12,15 నంబర్ స్టోర్లను స్టాకును పరిశీలించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సూర్యనారాయణ, రెవెన్యూ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతం ఆచరిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని సునామ జకినీ మాత ఆలయంలో కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సురేష్‌రావు, ఆలయ ప్రధాన కార్యదర్శి సాయినాథ్, సాయి సుభాష్ 108 జంటలతో వ్రతాన్ని చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు కార్యక్రమం సాగింది. ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ జాయింట్ సెక్రటరీ రవి బాబు, కార్యవర్గ సభ్యులు లక్ష్మీకాంత్, సునీల్ , రామచంద్ర, మంజునాథ్‌రావు, నాగరాజు రావు, సాయిబాబా, సంపత్ లక్ష్మణ రావు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు నార్పలలో భూపంపిణీ

శింగనమల: నియోజకవర్గంలోని శింగనమల, గార్లదిన్నె, నార్పల, బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని 302 మంది రైతులకు 420.31 ఎకరాలు భూ పంపిణీ చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. శనివారం నార్పలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం జరగనుంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



క్రీడా సామగ్రి అందిస్తున్న దృశ్యం

యాడికి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని 14 పంచాయతీలకు క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, ఎంఈఓ కాశెప్ప, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏఓ నాగేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్



తాడిపత్రిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య



తాడిపత్రి మండలం గన్నేవారిపల్లి కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: అర్హులందరికీ పథకాలు అందించడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ సారథిగా ప్రజల గుండెల్లో నిలిచారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనివాస పురం సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పథకాల అమలులో చరిత్ర సృష్టించారన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రధానంగా బీసీల సంక్షేమ కోసం జగనన్నలా దేశంలో ఏ ముఖ్యమంత్రి కృషి చేయలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జావిద్‌ఖాద్రీ, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబా, విద్యార్థి విభాగం పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు పేరం ఆది, గంగాధర్, మున్సిపల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: మండలంలోని గన్నేవారిపల్లి కాలనీలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ ఓబుళరెడ్డి సచివాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జగనన్నతోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు చేసిన మోసాలను గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను గెలిపించుకుందామని కోరారు.

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోండి



పామిడిలో ఆర్బీకేలో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరాముడు

పామిడి: రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. స్థానిక ఆర్బీకేలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ ఏసందర్భంగా ఏడీఏ వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న పథకాలనువివరించారు. ఖరీఫ్‌కు సంబంధించి 6,657 మంది రైతులకు గానూ రూ.9,03,09,623 ఇన్‌పుట్ సబ్సిడీ వర్తించేలా ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర, సాయిల్ హెల్త్ కార్డులు, డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారీ, నానో యూరియా, డీఏపీపై అవగాహన కల్పించారు. అనంతరం పామిడిలో రబీలో సాగుచేసిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమాల్లో ఏఓ డీ లీనా వసుంధర, ఏఈఓ శ్రీనివాసరావు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రబీలో రైతులు పంటల సాగును ఈ- క్రాప్ నమోదు చేయించు కోవాలని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండన్న అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రాప్‌తో పంట నష్టపోతే ప్రభుత్వం ద్వారా పరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వైస్ ఎంపీపీ రామగోపాల్, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి శైలజ, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు, రైతులు పాల్గొన్నారు.

గనుల తవ్వకంపై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న గనుల యజమానులు

యాడికి: చందన గ్రామంలో ఉన్నత పాఠశాల వద్ద పర్యావరణ మండలి అధికారుల సమక్షంలో శుక్రవారం గనుల తవ్వకంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. చందన గ్రామ సమీపంలో ఉన్న కొండలో సర్వే నం:728లో 10 హెక్టార్లలో మురళీ కృష్ణ క్రషర్స్ యాజమాన్యం, అదే 728 సర్వే నంబర్‌లో 9,165 హెక్టార్లలో బీఎస్ఎస్ మినరల్స్ ఆధ్వర్యంలో మైనింగ్ చేపట్టనున్నారు. ఈసందర్భంగా చందన, పచ్చారుమేకల పల్లె గ్రామస్తులు మాట్లాడుతూ మైనింగ్ ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల్లోని మూగ జీవాలకు మేత దొరకదని తెలిపారు. ఉన్నత పాఠశాలకు పోయే రహదారిలో దుమ్ము, ధూళి అధికంగా వస్తుందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతారన్నారు. మైనింగ్ ఏర్పాటు చేసిన అనంతరం గ్రామాభివృద్ధికి సహకరించాలని పర్యావరణ వేత్తలు అధికారులను కోరారు. ఎటువంటి ఇబ్బంది కలగకుండా గ్రామం అభివృద్ధికి సహకరిస్తామని మైనింగ్ అధికారులు హామీ ఇచ్చారు. గుంతకల్ ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ బాలమ్మ, కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిశోర్ కుమార్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్కాబీటర్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని చౌడేశ్వరీ కాలనీలో మట్కా రాస్తున్న నల్లన్న, కంబగిరి స్వామి, రామకృష్ణను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.7,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

గడ్డివామి దగ్ధం

పెద్దవడుగూరు: ఆవులాంపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున గడ్డివాము దగ్ధమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు విజయభాస్కరరెడ్డి తన దొడ్డిలో జొన్న, వరిగడ్డి వామిగా వేసుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు వామికి నిప్పుపెట్టడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. ఘటనలో రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేసారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. సమస్యపై తాము పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లేందుకు యత్నించగా అమర్యాదగా మాట్లాడడమే కాకండా సీఐ సిబ్బందితో బయటకు గెంటిచాడన్నారు. నాయకులు పుల్లయ్య, రాజరత్నం, కుళ్లాయప్ప, శివుడు, భాస్కర్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



పుట్లూరు ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న డీవైఈఓ శ్రీనివాసులు

పుట్లూరు: క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని డీవైఈఓ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆదర్శ పాఠశాల, పుట్లూరు, కొండేపల్లిజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఓ ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. మొబైల్ ఫోన్లకు బానిస కావడం వల్ల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. ఎంఈఓ శ్రీదేవి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంపై అవగాహన

తాడిపత్రిటౌన్: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై తహసీల్దార్ అలెగ్జాండర్, మున్సిపల్ కమిషనర్ రవి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో కలిసి ఈవీఎంల పనితీరును వివరించారు.

మాజీ సర్పంచ్ మృతి



లక్ష్మీనారాయణ(ఫైల్)

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ నాగేశ్వరమ్మ భర్త, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ(48) మృతి చెందాడు. ఈయన నెల రోజులుగా అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నాడు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. లక్ష్మీనారాయణ వైఎస్సార్‌సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్‌గా పని చేస్తున్నాడు. ఎంపీపీ విశాలాక్షి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి ఫోన్‌లో నాగేశ్వరమ్మను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఘనంగా ఏకాదశి పూజలు



శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

పామిడి: పట్టణంలోని స్థానిక తగ్గుదేవాలయం, చిన్న వితోబ, కన్యకా పరమేశ్వరి, భోగేశ్వరాలయంలో ఉత్పన్న ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల్లో అనంత గజగరుడ లక్ష్మీ నారాయణ స్వామి, రుక్మిణీ పాండురంగస్వామి, కన్యకాపరమేశ్వరి, భోగేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం గావించారు.

షంషీర్‌వలి సాహెబ్ ఉరుసు



ఉరుసులో పాల్గొన్న నాయకులు

తాడిపత్రి అర్బన్: పెన్నా నది తీరంలో హజరత్ షంషీర్‌వలి సాహెబ్ ఉరుసు వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాషా, వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాషావలి, ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా పూలచాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం



గ్రామస్తులతో మాట్లాడుతున్న యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: జగనన్న తోనే పేదల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. దిగువపల్లి, ఎగువపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో లాగా పథకాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదన్నారు. అవ్వాతాతలకు 1వ తారీఖునే ఇంటి తలుపు తట్టిమరీ ఫించన్ అందజేస్తున్నారన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ కి ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగించుకుమని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ శేఖర్‌నాయుడు మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, నాయకులు వాసుదేవరెడ్డి, వీరానారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, రాజపుల్లారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ‘ప్రజావేదిక’



ప్రజా వేదికలో మాట్లాడుతున్న అధికారులు

గుంతకల్లు రూరల్: ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం సామాజిక తనిఖీల ప్రజా వేదిక కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అంబుడ్స్‌మెన్ మధుసూదన్ హాజరయ్యారు. సామాజిక తనిఖీల బృందం సభ్యులు తనిఖీల్లో గుర్తించిన వివరాలను చదివి వినిపించారు. మండలంలో 14,454 మంది కూలీలకు 4,66,697 పని దినాలను కల్పించారని, ఇందులో కూలి రూపంలో రూ.10.68 కోట్లు, మెటీరియల్ కోసం రూ.28 లక్షలు ఖర్చు చేసినట్లు తనిఖీ సిబ్బంది తెలిపారు. గ్రామ వలంటర్లకు వారానికి 3 రోజులు మాత్రమే ఉపాధి పనులు కల్పించాల్సి ఉండగా వారం రోజులు కల్పించారని, పని జరిగిన ప్రాంతాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదని తనిఖీల బృందం సభ్యులు తెలియజేశారు. ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి బాధ్యుల నుంచి రూ.48,137 రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఎంపీడీఓ వెంకటరమణప్ప, ఎంపీపీ బీవీ మాధవి, మండల ఇంజనీర్ ఓబులేసు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దత్తు, ఏపీవోలు కృష్ణమూర్తి, సాలయ్య పాల్గొన్నారు.

‘ఇంటి పట్టా ఇప్పించుకోమని ఎవరూ చెప్పలేదు’

యాడికి: పేదలకు ఇచ్చిన ఇంటి పట్టాను వెనక్కి ఇప్పించుకోమని తనకు ఎవ్వరూ చెప్పలేదని, తాను ఎవ్వరినీ అడగలేదని రాయలచెరువు సచివాలయ వలంటీర్ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలచెరువులో మూడేళ్ల క్రితం 118 మందికి ఉన్నత పాఠశాల సమీపంలో కొండ వద్ద ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారన్నారు. గనుల యజమానుల విన్నపం మేరకు ప్రభుత్వం మోడల్ స్కూల్ ఎదురుగా స్థలాలు కేటాయించిందన్నారు. గతంలో పేదలకు ఇచ్చిన ఇంటి పట్టా నంబర్‌తోనే మోడల్ స్కూల్ ఎదురుగా ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని అధికారులు చెప్పారన్నారు. ఈ మేరకు లబ్ధిదారులు ఇంటి పట్టాలను సిద్ధంగా ఉంచుకోవాలని మాత్రమే తాను చెప్పానని వలంటీర్ వివరించాడు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆదేశాల మేరకు తాను ఇంటి పట్టా వెనక్కి ఇవ్వాలని రాజకుళ్లాయప్పను అడగలేదని, దీనిపై ఈనాడు, ఆంధ్రజ్యోతిలో కథనాలు రావడం విడ్డూరంగా ఉందన్నారు.

‘జగనన్న ప్రభుత్వం ఊళ్లు నిర్మిస్తోంది’



గుత్తి జగనన్న కాలనీలో ఇంటిని పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని లచ్చానపల్లి , నేమతాబాద్, తాడిపత్రి రోడ్లలోని జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి పలువురు సభ్యులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏకంగా ఊళ్లనే నిర్మిస్తోందన్నారు. టీడీపీ, జనసేన నాయకులకు కళ్లున్న కబోధిలా ప్రవర్తిస్తున్నారన్నారు. కళ్ల ముందే అభివృద్ధి జరుగుతున్నా జరగడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోందన్నారు.

నేత్రపర్వంగా నిజరూప పాదదర్శనం



పూజలందుకున్న రుక్మిణీ విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: నగరంలోని రాంనగర్ రుక్మిణీ పాండురంగవిఠల ఆలయంలో కార్తీక ఉత్పత్తి ఏకాదశిని పురస్కరించుకొని రుక్మిణీ విఠల పాండురంగ నిజరూప పాదదర్శనం శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఉదయం జరిగిన కార్యక్రమంలో భక్తులు బారులు తీరి స్వామిని ఆరాదించారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు దుస్తకర్ తిరుపతిరావు, ఆనంద మహేంద్రకర్ మాట్లాడుతూ ప్రతి ఏకాదశికి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కలిగిస్తున్నట్లు తెలిపారు. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

బుక్కరాయసముద్రం: కొర్రపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ వరలక్ష్మి తెలిపారు. 7వతరగతి విద్యార్థి హర్షిత, 8వ తరగతి విద్యార్థి ఇందు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

15 నుంచి ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు

గార్లదిన్నె: మండలంలో ఈనెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 13లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మెహందీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

గుంతకల్లుటౌన్: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య, మహిళా సాధికారిత విభాగపు కోఆర్డినేటర్ శ్రీవాణి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు రంగోలి, మెహందీ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు జనార్దన్‌శాస్త్రి, పావని, జమీలాబీ, వనజ తదితరులు పాల్గొన్నారు.

రేపు బలిజల వనభోజన మహోత్సవం

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న జేజే కాలనీలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయ బలిజ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున బలిజల వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారాకుల రమణ, రాము, రామాంజనేయులు, కోశాధికారి మంజు తెలిపారు. జేజే కాలనీలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. బలిజ కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాగరాజు, నాని తదితరులు పాల్గొన్నారు.

మిరప పంట పరిశీలన



మిరప పంటను పరిశీలిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరులో శుక్రవారం మిరప పంటను జిల్లా ఉద్యాన సహాయ సంచాలకులు బీవీ నరసింహారావు, ఏపీడీ ఫజులున్నీషాబేగం, ఉద్యాన అధికారి శైలజ పరిశీలించారు. ఈ సందర్భంగా మిరప పంటలో ప్రస్తుత పరిస్థితులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. తామర పురుగు వల్ల కలిగే నష్టాన్ని వివరించడంతో పాటు నివారణ కోసం పిచికారీ చేయాల్సిన మందులను తెలియజేశారు. వీహెచ్ఏ రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం




విజేత జట్టుకు కప్ అందిస్తున్న కేసీ హరి

గుంతకల్లు: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ కేసీ హరి పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు, సిబ్బంది మధ్య స్నేహపూర్వకంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు జట్టుపై ప్రిన్సిపాల్ గోపాల్ జట్టు విజయం సాధించింది. గెలిపొందిన జట్టుకు హరి కప్‌ను అందజేశారు. ఏఓ డాక్టర్ చంద్రశేఖర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రఘు, పీడీ బాషా, ఎన్ఎస్ఎస్ పీఓ బసెట్టి కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ గోపీ, డాక్టర్ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పరిహారం అందించాలి

గుంతకల్లు రూరల్: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని సీపీఎం నాయకులు శుక్రవారం తహసీల్దార్ ప్రతాప్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు దాసరి శ్రీనివాసులు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు గరిష్ఠంగా రూ.50 వేల వరకూ పరిహారం అందించాలన్నారు.

శింగనమల ఎస్ఐగా విజయభాస్కర్



శింగనమల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ బాలకృష్ణయ్య నాలుగు నెలల క్రితం తిరుపతికి బదిలీ అయ్యారు. దీంతో అనంతపురంలో ఎస్‌బీలో పని చేస్తున్న విజయభాస్కర్‌ను ఇక్కడికి నియమించారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడుతామని కొత్త ఎస్ఐ పేర్కొన్నారు.